# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 29-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈరోజు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తో సమావేశమయ్యారు.
- ❖ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో సాంకేతికత అభివృద్ధికి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు సహకరించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి కోరారు.
- ❖ దేశంలో ప్రతి విద్యార్థికి ప్రపంచ స్థాయి జ్ఞానాన్ని చేరువ చేసే దిశగా ప్రభుత్వం పని చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు.
- ❖ "చార్ ధామ్ యాత్ర" అక్షయ తృతీయ సందర్భంగా రేపు ప్రారంభం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన ఈరోజు న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సమావేశమయ్యారు. ఈ సమావేశానికి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(CDS) అనిల్ చౌహాన్, త్రివిధ దళాల అధిపతులు హాజరయ్యారు. కాశ్మీర్ లోని పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ప్రతి విద్యార్థికి ప్రపంచ స్థాయి జ్ఞానాన్ని చేరువ చేసే దిశగా ప్రభుత్వం పని చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ప్రభుత్వ విద్యాసంస్థలు, పరిశ్రమలు, ఆవిష్కరణల నాయకులతో నిర్వహించిన మొట్టమొదటి సమ్మేళనం యుగ్మ లో ప్రధానమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 21వ శతాబ్దపు అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను ప్రభుత్వం ఆధునీకరించిందని చెప్పారు. దేశ అభివృద్ధి యువతపై ఆధారపడి ఉంటుందని, అటువంటి యువతకు ఉజ్వల భవిష్యత్‌ను అందించడం ఎంతో అవసరమని ప్రధానమంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 30 సెకన్లు)

భారతదేశ విశ్వవిద్యాలయాలు యువతను ఆవిష్కర్తలుగా నిలిపే చోదక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. “వన్ నేషన్ - వన్ సబ్ స్క్రిప్షన్” పథకం ప్రతి విద్యార్థికి ప్రపంచ స్థాయి జ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువస్తోందని ప్రధానమంత్రి తెలిపారు. సమాచార సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి, స్వీకరణలో భారతదేశం అగ్రగామి దేశాలలో ఒకటిగా నిలుస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ లు పాల్గొని ప్రసంగించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో అత్యంత విశిష్టత కలిగిన “చార్ ధామ్ యాత్ర” అక్షయ తృతీయ సందర్భంగా రేపు ప్రారంభం కానుంది. ఉత్తర కాశీ జిల్లాలో ఉన్నగంగోత్రి, యమునోత్రి ఆలయాల తెరుచుకోవడంతో ఈ యాత్ర ప్రారంభమవుతుంది. రుద్ర ప్రయాగలోని కేదార్‌నాథ్ ఆలయం మే 2న, చమోలి జిల్లాలోని బద్రీనాథ్ ధామ్ ఆలయం మే 4న తెరుస్తారు. చార్ ధామ్ యాత్రకు ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగానే కాకుండా, విదేశాల నుండి లక్షలాది మంది భక్తులను హాజరావుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, జనసమూహ నియంత్రణ, ఆరోగ్యం, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. ఈ యాత్ర ప్రారంభోత్సవాన్ని ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. గంగోత్రి ధామ్ ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసారం రేపు ఉదయం 10 నుండి 11 గంటల వరకు, యమునోత్రి ధామ్ ప్రత్యక్ష ప్రసారం రేపు ఉదయం 11:30 నుండి 12:30 వరకు జరుగుతుంది. ప్రత్యక్ష ప్రసారం ఆకాశవాణి ఇంద్రప్రస్థ, FM గోల్డ్ ఆరాధన ఛానెల్‌లతో పాటు న్యూస్ ఆన్ ఎయిర్ యాప్‌లో కూడా అందుబాటులో ఉంటుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జై శంకర్ ఈరోజు గ్రీస్ దేశ విదేశాంగ మంత్రి జార్గోస్ గెరా పెట్రిటిస్ తో ఫోనులో మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి గురించి ఇరువురు నాయకులు చర్చించారు. సరిహద్దు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా గ్రీస్ ఆచరిస్తున్న బలమైన వైఖరినీ కేంద్రమంత్రి ప్రశంసించారు. ఇరు దేశాలు వ్యూహాత్మక భాగస్వామ్యం, దేశాల మధ్య బలమైన సంబంధాలను ప్రతిబింబిస్తుందని ఎస్.జై.శంకర్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పెహల్గాం ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు 50 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ప్రకటించారు. ఈరోజు ముంబైలో జరిగిన క్యాబినెట్ సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ సంఘటనలో మరణించిన సంతోష్ జగ్దలే కుమార్తె ఆస్వారి జగ్దలేకు ప్రభుత్వ ఉద్యోగం అందిస్తామని చెప్పారు. మహారాష్ట్ర క్యాబినెట్ నూతన ఎలక్ట్రిక్ వాహనాల విధానానికి, చార్జింగ్ స్టేషన్ల మౌలిక వసతులకు కల్పనకు, రాష్ట్రంలో ఓడరేవుల ద్వారా ఉపాధి పెంపొందించడం, నూతన పంట బీమా విధానాలకు ఆమోదం తెలిపింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

భవిష్యత్ ఇంధనంగా గ్రీన్ హైడ్రోజన్ నిలుస్తుందని కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ఎంఎస్ఎంఈలకు అవకాశాలపై జరిగిన కార్యశాలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.... గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో సాంకేతికత అభివృద్ధికి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు సహకరించాలని కోరారు. పునరుత్పాదక శక్తి దిశగా భారతదేశాన్ని శక్తివంతం చేయగల సాంకేతికత ఆలోచనలతో ముందుకు రావాలని ఎమ్.ఎస్.ఎం.ఈ లకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో భారత దేశ గ్రీన్ హైడ్రోజన్ సర్టిఫికేషన్ పథకాన్ని కూడా కేంద్రమంత్రి ప్రారంభించారు. దేశంలో నాలుగు లక్షల 12 వేల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కోసం జపాన్ తో ఒప్పందంపై సంతకాల చేశామని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో 2030 నాటికి దీనిని 5 మిలియన్ టన్నులకు పెంచాలని మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకుందని కేంద్రమంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పవిత్ర హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులకు కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శుభాకాంక్షలు తెలిపారు. మొత్తం లక్షా 22 వేల 518 మంది ఈ యాత్రకు వెళుతుండగా మొదటి విడతలో లక్నో నుండి 288 మంది, హైదరాబాద్ నుండి 262 మంది యాత్రికులతో విమానాలు బయలుదేరాయి. హజ్ యాత్రను సజావుగా నిర్వహించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సామాజిక మాధ్యమంలో కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించేందుకు ఢిల్లీ క్యాబినెట్ ఈరోజు ఒక ముసాయిదా బిల్లును ఆమోదించింది. పాఠశాల ఫీజులు గణనీయంగా పెంచడంపై తల్లిదండ్రుల నుంచి వస్తున్న ప్రతిస్పందన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేఖ గుప్తా మాట్లాడుతూ... ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఉపశమనం కలిగించే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా సమగ్రమైన బిల్లును రూపొందించిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, ప్రైవేట్ సంస్థలతో సహా ఢిల్లీలోని అన్ని పాఠశాలల్లో ఫీజులను నిర్ణయించడానికి పూర్తి మార్గదర్శకాలు, విధానాలను బిల్లు వివరిస్తుందని ఆమె తెలియజేశారు. ఈ బిల్లును ఢిల్లీ అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించి, చట్టంగా తీర్చిదిద్ది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై నిబంధనలను అమలు చేస్తామని రేఖా గుప్తా వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు మహిళల క్రికెట్ టోర్నమెంట్‌లో ఈరోజు భారత్ మహిళల క్రికెట్ జట్టు సౌతాఫ్రికాపై 15 పరుగులతో తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ జట్టు 50 ఓవర్లలో 6 వికెట్ల కోల్పోయి 276 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సౌత్ ఆఫ్రికా జట్టు 49.2 ఓవర్లలో 261 పరుగులకు ఆల్ అవుట్ అయింది. భారత జట్టులో ప్రతిక రావల్ 78 పరుగులు చేయగా భారత బౌలర్ స్నేహ రాణా ఐదు వికెట్లు సాధించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న రెండు రోజుల్లో నైరుతి రాజస్థాన్ పశ్చిమ హిమాలయ ప్రాంతాలలో వేడిగాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. మే ఒకటి నుంచి ఢిల్లీతో సహా దేశంలోని వాయువ్య ప్రాంతాలలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఒరిస్సాలో రానున్న రెండు, మూడు రోజులలో మోస్తరు నుండి ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని.. పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ లలో రాబోయే రెండు మూడు రోజులు వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =